క్లుప్తంగా

అయ్యప్పస్వామి పూజల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాళెం కొండపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం జరిగిన పూజల్లో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఏటా కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ వెలసిన అయ్యప్ప గుడిలో జరిగే పూజల్లో ఆయన పాల్గొంటున్నారు.

కళాతరంగిణి సంస్థ విద్యార్థుల ప్రతిభ



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న కళాతరంగిణి విద్యార్థులు

బైరెడ్డిపల్లె: కడప శిల్పారామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతికోత్సవాల్లో బైరెడ్డిపల్లె కళాతరంగిణి సంస్థ విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శాస్త్రీయ, జానపద నృత్యాలతో అలరింపజేసిన విద్యార్థులు లహరి, గగన్, భరత్, శృతి, రమ్య, భార్గవి, జీవన్, మధుశ్రీలను శిల్పారామం పరిపాలనాధికారి శివప్రసాద్ అభినందించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించిన కళాతరంగిణి సంస్థ వ్యవస్థాపకులు రాజేష్‌బాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పద్మాకర్, మధు, రామచంద్ర, ఓబులేసు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

పుంగనూరు: పట్టణంలోని మార్కెట్ కమిటీలో పశువుల సంతకు తీసుకొచ్చిన ఆవు విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన సంఘటన బుధవారం జరిగింది. చౌడేపల్లె మండలం శెట్టిపేటకు చెందిన రమేష్ తన పాడి ఆవును సంతలో విక్రయించేందుకు తీసుకొచ్చాడు. అక్కడ విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ఆవుకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలిసిన వెంటనే ఏఈ మహేంద్రరెడ్డి సంఘటన స్థలాన్ని చేరుకొని ఆవు మృతికి గల కారణాలపై విచారణ చేశారు. ఆవు రూ.30 వేల విలువ చేస్తుందని బాధిత రైతు తెలిపాడు.

నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత గోవిందప్ప తల్లి వెంకటలక్ష్మి బుధవారం మృతిచెందారు. విషయం తెలిసి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మండలంలోని పి.కొత్తూరులోని మృతురాలి నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

పులిచెర్ల(కల్లూరు): బస్సు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన కల్లూరు బస్టాండు సమీపంలో పీలేరు రోడ్డులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..కల్లూరుకు చెందిన షౌకత్(60) బస్టాండ్ నుంచి ఇంటికి వెళుతున్నాడు. కల్లూరు పోలీసు సర్కిల్ ఆఫీసు వద్ద పీలేరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని పీలేరు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడ నుంచి తిరుపతి రుయాకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రంకెలేసిన ఉత్సాహం

బైరెడ్డిపల్లె: యువత కేరింతల మధ్య పరుగులు తీస్తున్న పశువు



పెద్దపంజాణీలో గోవులకు ప్రత్యేక అలంకరణలు, పూజలు





- కోలాహలం.. కనుమ పండుగ
- గోవులకు ప్రత్యేక అలంకరణలు
- గంగరాజు చుట్టూ గోవుల ప్రదక్షిణలు
- గ్రామాల్లో మినీ మైలేరు పండుగలు



కనమనపల్లెలో పూజలు

పలమనేరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పలమనేరు నియోజకవర్గంలో బుధవారం కనుమ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. రైతులు పెద్ద పండుగగా భావించే సంక్రాంతిలో పాడి పశువులదే పెద్ద పీట. ఆ మేరకు రైతులు వారి ఎడ్లను, పాడి ఆవులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలోని గంగరాయి చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని సంబంధిత ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. రైతుకు ఆసరాగా నిలిచే పాడి పశువులు ఎప్పటికీ ఆరోగ్యంగా వుండాలని రైతులు కనుమ సందర్భంగా కోరుకున్నారు. పలు గ్రామాల్లో ఎడ్ల మెరవణి ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎద్దులను ప్రభలతో అలంకరించి గ్రామ నడివీధిలో పరుగెత్తించారు. అదేవిధంగా పలు గ్రామాల్లోనూ ఎడ్లను పూజించి వీధుల్లో తిప్పారు. పలు గ్రామాల్లో మహిళలు పొంగళ్లను మోశారు.

బైరెడ్డిపల్లె: కనుమ పండుగను బుధవారం మండల పరిధిలో కోలాహలంగా జరుపుకున్నారు. ఉదయం పశువులను రంగురంగు కాగితాలతో ముస్తాబు చేశారు. గ్రామ నడివీధి గంగమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. బైరెడ్డిపల్లె, కడపనత్తం, నెల్లిపట్ల, తీర్థం గ్రామాల్లో పశువులను వీధుల్లో వదిలిపెట్టడంతో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలో బుధవారం ఉదయం 6 గంటలకు చల్లు ఎత్తుకుని వెళ్లి చెరువులో వేశారు. అనంతరం పశువులను చెరువుల్లో ఈత వేసి కొమ్ములు జివిరి రంగులు వేసి అలంకరణ చేశారు. సాయంత్రం 6 గంటలకు పసలదేవర దగ్గరకు ర్యాలీగా తీసుకుని వెళ్లి చిట్ల కుప్పకు నిప్పు పెట్టి బెదిరించారు. మహిళలు అందరు కాటమరాజుకు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని పశువులన్నింటినీ ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం వీధుల్లో వీటిని తరమడంతో ప్రజలు ఎంతో ఆసక్తితో తిలకించారు.

పెద్దపంజాణీతలో..

పెద్దపంజాణి: మండలంలోని పలు గ్రామాల్లో కనుమ పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. ఎద్దులు, కోడెగిత్తలను వీధుల్లో పరుగులు తీయించారు. వీటిని నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. సాయంత్రం కాటమరాజుకు పూజలు చేసి, చిట్లాకుప్పకు నిప్పుపెట్టి తీర్థప్రసాదాలు అందజేశారు.

సదుంలో..

సదుం: మండలంలో కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. పశువులను శుభ్రం చేసి పూజలు చేశారు. ఊరేగింపుగా గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన చిట్లాకుప్ప వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వాటిని బెదిరిస్తూ యువకులు సందడి చేశారు. చిట్లాకుప్పకు నిప్పు పెట్టి వాటి చుట్టూ పశువులను తిప్పారు. కాటమ రాజుకు పూజలు చేసి భక్తులకు ప్రసాదం పంచారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: గుడుపల్లెలో కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో జనం పాల్గొన్నారు.

రొంపిచెర్ల మండలంలో కనుమ పండుగ



రొంపిచెర్లలో మండలంలో ..



రొంపిచెర్ల మండలంలో చిట్లాకుప్పకు నిప్పు..





బైరెడ్డిపల్లె: మినీ మైలేరులో పరుగులు తీస్తున్న కోడెలు



రాయలపేట పురవీధుల్లో..



సదుంలో..

క్యాలెండర్ల ఆవిష్కరణ



పెద్దపంజాణి: మండలంలోని గోనుమాకులపల్లికి చెందిన జై భీమ్ యూత్ ఫౌండేషన్ చైర్మన్ బి.శంకర్ సంస్థ సభ్యులతో కలసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంగళవారం ఎర్రాతివారిపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను పెద్దిరెడ్డి ఆవిష్కరించారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

గోవులను కబేళాలకు తరలిస్తే ఊరుకోం



బాధ్యతలు స్వీకరిస్తున్న అయూబ్‌ఖాన్

- జాతీయ గో సంరక్షణ కార్యదర్శి అయూబ్‌ఖాన్

పుంగనూరు: పవిత్ర భారతదేశంలో గోవులకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అలాంటి గోవులను కబేళాలకు తరలించి, లక్షలాది రూపాయలు సంపాదించే వారి భరతంపడతామని, కబేళాలను అడ్డుకుంటామని జాతీయ గోసంరక్షణ జనరల్ సెక్రటరీ అయూబ్‌ఖాన్ హెచ్చరించారు. బుధవారం పట్టణ ప్రముఖుల ఆధ్వర్యంలో ఆయన జాతీయ గోసంరక్షణ జనరల్ సెక్రటరీ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆల్ ఇండియా కౌవ్ ప్రొటెక్షన్ మహాసంఘ్ జాతీయ అధ్యక్షుడు ఖలీమ్ భారతీయ నియామక ఉత్తర్వులు పంపారు. అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో పశువులను కబేళాలకు తరలిస్తూ లక్షలాది రూపాయలు ముడుపులు చెల్లిస్తున్నారని తెలిపారు. పశువులను కబేళాలకు తరలించడం మహాపాతకమన్నారు. వీటిని అన్ని ప్రాంతాల్లోను అడ్డుకునేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తవత్సలరాజు, బాలసుబ్రమణ్యం, త్రిమూర్తిరెడ్డి, ముత్యాలు, ఎర్రప్ప యాదవ్, మునస్వామి, రెడ్డెప్పరెడ్డి, టీపీఎస్. నాగరాజు, రాజు, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్లకీలో శివపార్వతుల విహారం

తవణంపల్లె: కనుమ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అరగొండలోని శివాలయంలో బుధవారం ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించారు. శివపార్వతులకు అభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణతోపాటు పూజలు చేసి, ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం సుగంధ పుష్పాలతో అలంకరించిన పల్లకీలో శివపార్వతులు విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు ఇంటింటా స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



నందీశ్వరునిపై పార్వతీపరమేశ్వరులు

శాస్త్రోక్తంగా మకర జ్యోతి దర్శనం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లో వెలసిన శ్రీ శాస్త్రగిరి అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం మకర జ్యోతి శాస్త్రోక్తంగా వెలిగించారు. ఆలయంలోని అయ్యప్ప స్వామికి ఉదయం అభిషేక పూజలు చేశారు. తర్వాత మకర జ్యోతి దర్శన పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగర వీధుల్లో ఊరేగించి మకర జ్యోతి దర్శనం కల్పించారు. జ్యోతి దర్శనార్థం భక్తులు పోటెత్తారు.

కొత్త ఆస్పత్రికి ఆక్సిజన్ ఎప్పుడో?

- ప్లాంట్ ఉన్నా పనిచేయని పీఎస్ఏ
- మేజర్, మైనర్ రిక్వైర్‌మెంట్స్ పెండింగ్‌లోనే
- ఇన్‌పేషెంట్ బెడ్లకు ఆక్సిజన్ కనెక్షన్ ఇంకా లేదు
- గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కోవిడ్ వార్డే దిక్కు



పలమనేరు వంద పడకల ఏరియా ఆస్పత్రి



పని చేయని ఆక్సిజన్ యూనిట్ యంత్రం

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని చూసిన వారెవరైనా ఇంత పెద్ద ఆస్పత్రా ఇక్కడ అన్నీ సౌకర్యాలుంటాయనుకుంటారు. గతంలో కోవిడ్ వచ్చినప్పుడు ఈ ఆస్పత్రి ఏర్పాటు చేసిన 30 బెడ్ల కోవిడ్ వార్డు ఎందరో ప్రాణాలను కాపాడింది. ముఖ్యంగా కొత్త ఆస్పత్రిలో ప్రత్యేక కోవిడ్ వార్డు సౌకర్యాలను ఇంకా కల్పించలేదు. కృత్రిమ శ్వాసను అందించేందుకు గత ప్రభుత్వంలోనే ఆక్సిజన్ ప్లాంట్ ఉన్నా దీని నుంచి పాత ఆస్పత్రిలోని ఐదు బెడ్లకు మాత్రమే ఆక్సిజన్ సౌకర్యం ఉంది. మిగిలిన 25 బెడ్లకు కనెక్షన్‌ను ఇంకా ఏర్పాటు చేయలేదు. మరోవైపు కొత్తగా నిర్మించిన బెడ్లలో ఇన్‌పేషెంట్లకు సైతం ఆక్సిజన్ లైనింగ్ ఇంకా ఏర్పాటు చేయలేదు. వైరస్ సోకిన రోగులకు ఆక్సిజన్ అందించడం చాలా ముఖ్యమైనప్పటికీ దీనిపై కూటమి ప్రభుత్వం ఇంకా దృష్టి సారించలేదు.

ప్లాంట్ ఉన్నా తప్పని సమస్యలు

గత ప్రభుత్వంలో రూ.16 కోట్లతో ఈ ఆస్పత్రిని వంద పడకలుగా మార్చి నాడు నేడు ద్వారా నిర్మించారు. కొత్త భవనం ఈ ఏడాది మార్చి ఏడున ప్రారంభమై సేవలు అందుబాటులోకి వచ్చాయి. పాత ఆస్పత్రిలో ఐదు బ్లాకులుండగా అదనంగా మరో ఐదు బ్లాకులతో కొత్త ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు. 50 మందికి సరిపడా ఎమర్జెన్సీగా ఆక్సిజన్ అందించే సామర్థ్యంతో ఆక్సిజన్ ప్లాంట్‌ను నిర్మించారు. అయితే ఈ బెడ్లకు ఆక్సిజన్ అందించే పైప్‌లైన్ ఇంకా అమర్చలేదు. ఆక్సిజన్ ప్లాంట్ ఉన్నా ఆస్పత్రిలో ఆక్సిజన్ సరఫరా అయ్యేందుకు లైనింగ్ సౌకర్యాన్ని ఇంకా ఏర్పాటు చేయలేదు. ఇవన్నీ అందుబాటులోకి వస్తే తప్ప ఇక్కడి ఆస్పత్రిలో రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి రాని పరిస్థితి నెలకొంది. మరోవైపు గాలి ద్వారా ఇక్కడికక్కడే ఆక్సిజన్‌ను తయారు చేసేందుకు అత్యంత ముఖ్యమైన పీఎస్ఏ(ప్రెస్యూర్ స్వింగ్ ఎడ్‌సోర్షెన్) యంత్రం ఉన్నా దాని అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వినియోగిస్తారట. ప్రస్తుతానికి ఆక్సిజన్ సిలిండర్‌ను తెచ్చి ప్లాంట్‌లో నింపి దాని నుంచి ఆక్సిజన్‌ను బెడ్లకు పంపాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్త వైరస్ నేపథ్యంలో వీటిని మరమ్మతులు చేసి కొత్త భవనంలో సైతం మరో 30 బెడ్లను ముందస్తుగా ఏర్పాటు చేయాల్సి ఉంది.

రూ.45 లక్షలు కావాల్సిందే

ఇక్కడి పాత ఆస్పత్రిలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కోవిడ్ కేంద్రంలో 30 బెడ్లున్నా వీటిల్లో ఐదు బెడ్లకు మాత్రమే సిలిండర్ల ద్వారా ఆక్సిజన్ అందించే వెసులుబాటు ఉంటుంది. కొత్త ఆస్పత్రిలో హెచ్ఎంపీవీ వైరస్ కోసం 50 బెడ్లదాకా సిద్ధంగా ఉన్నా వీటికి ఆక్సిజన్ అందించే పైప్‌లైన్ లేదు. దీంతోపాటు గాలి నుంచి ఆక్సిజన్‌ను ఇక్కడే తయారు చేసే యంత్రం మరమ్మతులో ఉందని. వీటి మరమ్మతుల కోసం ఇటీవల రూ.45 లక్షల అంచనాలతో జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు.

ప్లాంట్ ఉన్నా ప్రయోజనం లేదు..

ఆక్సిజన్ యూనిట్ ఇక్కడ గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసినా దీని నుంచి ఇన్‌పేషెంట్స్‌కు పెట్టేందుకు ఇంకా లైనింగ్‌లేదు. ఇక్కడ ఆక్సిజన్ తయారు చేసే పరికరం పనిచేయడం లేదు. దీన్ని మరమ్మతు చేయాలని ఉన్నతాధికారులకు తెలిపాం. కలెక్టర్‌కు మేజర్, మైనర్ రిక్వైర్‌మెంట్స్‌కు రూ.45లక్షలు అవసరమని నివేదిక ఇచ్చాం. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. –డా.మమతారాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్



అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న భక్తులు

వి.కోట: పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆవరణలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మకరజ్యోతిని పురస్కరించుకుని అయ్యప్పస్వామికి ఉదయం అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాసార్లపల్లిలో స్వామివారిని పల్లకీపై ఉత్సవమూర్తులుగా ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.